క్లుప్తంగా

మద్యం బాటిళ్లు అక్రమంగా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

గిద్దలూరు రూరల్: పట్టణంలో 40 మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని స్థానిక ఎస్‌ఐ వి.మహేష్ శుక్రవారం అరెస్టు చేశారు. కొమరోలు మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి మద్యం వ్యాపారం చేసేందుకు అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకుని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ఆటోను ఢీకొన్న బైకు.. వ్యక్తికి గాయాలు

గిద్దలూరు రూరల్: ఆటోను బైకు ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ముండ్లపాడు సమీపంలో శుక్రవారం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. మండలంలోని నల్లగట్ల గ్రామానికి చెందిన చిలకల రంగనాయకులు బైకుపై ముండ్లపాడు వైపు వెళ్తూ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టాడు. బైక్‌పై వెళ్తున్న రంగనాయకులు కాలు విరిగింది. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది సంఘటన స్థలం వద్దకు చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స కోసం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పుల్లలచెరువు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మరియదాసు తెలిపారు. ఎంపీపీ లాజర్ అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు తప్పని సరిగా హాజరు కావాలని, అధికారులు తగిన సమాచారంతో హాజరు కావాలని ఆయన సూచించారు.

యర్రగొండపాలెం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వైవీ నాగేశ్వరప్రసాద్ తెలిపారు. సమావేశానికి ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్ అధ్యక్షత వహిస్తారని, ఎంపీటీసీలు, సర్పంచ్ పాల్గొంటారని, అన్ని శాఖలకు చెందిన అధికారులు తప్పని సరిగా హాజరై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని కోరారు.

జగనన్న గృహాలను త్వరగా పూర్తి చేయాలి



ఇళ్లను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి సాయికుమార్

పుల్లలచెరువు: మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న జగనన్న గృహాలను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి సాయికుమార్ అన్నారు. శుక్రవారం హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని కోమరోలులో జగనన్న లేఔట్ నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ లబ్ధిదారులకు సహకరించాలన్నారు. బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈయన వెంట ఎంపీడీవో మరియదాసు, వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కోఆర్డినేటర్ లక్ష్మీరెడ్డి, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

295 మందికి వైద్య పరీక్షలు

బేస్తవారిపేట: మండలంలోని నేకునాంబాద్‌లో గిద్దలూరుకు చెందిన డాక్టర్ బ్రహ్మానందరెడ్డి వైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. 295 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా కంటి శస్త్రచికిత్సలు 34, ఈఎన్‌టీ ఆపరేషన్‌లు 4, సాధారణ శస్త్ర చికిత్సలు ఏడుగురికి అవసరమని వైద్య నిపుణులు తెలిపారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ బ్రహ్మానందరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన శ్రీను

బేస్తవారిపేట: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని సోమవారిపేట చీతిరేల కతువపై శుక్రవారం జరిగింది. కంభం మండలం జంగంగుంట్లకు చెందిన శ్రీను బేస్తవారిపేట మండలం సోమవారిపేటలో జరుగుతున్న ఓ వివాహానికి హాజరయ్యాడు. మోటార్ సైకిల్‌పై స్వగ్రామం వెళ్తున్న సమయంలో చీతిరేల కతువ బ్రిడ్జిపై అదుపుతప్పి పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో 108లో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

జగనన్న సురక్షతో ఉచితంగా సర్టిఫికెట్లు



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: ప్రజలు తమకు అవసరమైన సర్టిఫికెట్లు ఉచితంగా పొందేలా జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శ్రీకారం చుట్టడం అభినందనీయమని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 19వ సచివాలయం పరిధిలో 33వ వార్డు, 20వ సచివాలయం పరిధిలో 34,35 వార్డుల్లో సురక్ష కార్యక్రమం నిర్వహించి సరిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, మార్కెట్ యార్డు చైర్మన్ గొలమారు శ్రీనివాసరెడ్డి, కోఆప్షన్ సభ్యులు వనజాక్షి, వార్డు ఇన్‌చార్జిలు ముత్తారెడ్డి వెంకటరెడ్డి, రోజ్ లిడియా, ఇన్‌చార్జి కమిషనర్ సుభానీ, జేసీఎస్ పట్టణ కన్వీనర్ రవిచంద్ర, నాగిరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పత్రాల పంపిణీ

కంభం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విద్యార్థులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శైలేంద్రనాథ్ అన్నారు. మండలంలోని పెద్దనల్లకాల్వ సచివాలయం పరిధిలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. పెద్దనల్లకాల్వ, నర్సిరెడ్డిపల్లి సర్పంచ్‌లు పాలడుగు ఓంకారం, సునీతా, ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, సచివాలయ కన్వీనర్ ఓరుగంటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అర్ధవీడు మండలంలో..

మండలంలోని వెలగలపాయలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ వెంకట్రావు, జెడ్పీటీసీ చెన్ను విజయ ముఖ్య అతిథులుగా హాజరై లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారుడికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. ఎంపీడీఓ జగదీష్, సర్పంచ్ రమణమ్మ, డీటీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కారం అవుతున్నాయని నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య అన్నారు. నగర పంచాయతీ పరిధిలో క్లబ్ రోడ్డులోని 5వ సచివాలయం, రాచర్ల రోడ్డులోని 10వ సచివాలయాల పరిధిలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 రకాల సర్టిఫికెట్లను అధికారయంత్రాంగం ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేయడం చాలా మంచి కార్యక్రమం అన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. నగర పంచాయతీ కమిషనర్ వై.రామకృష్ణయ్య, వైస్ చైర్మన్లు ఆర్‌డీ రామకృష్ణ, కాతా దీపికా పాల్గొన్నారు.

రాచర్ల: గ్రామాల్లో పేదలకు జగనన్న సురక్షతో ఉచిత సేవలు అందిస్తామని ఎంపీపీ షేక్ ఖాశింబీ అన్నారు. మండల కేంద్రం రాచర్ల బీసీ భవనంలో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం ఎంపీడీవో కవితా చౌదరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన 11 రకాల సేవలను సకాలంలో ఉచితంగా అందజేస్తామన్నారు. సంక్షేమ పథకాలు అర్హులను అందించడమే కాకుండా జగనన్న సురక్ష లక్ష్యమని వివరించారు. అనంతరం అర్హత కలిగిన నిరుపేదలకు కుటుంబాలకు కుల వీకరణ పత్రాలు పంపిణీ చేశారు. తహసీల్దార్ ఎం.దిలీప్‌కుమార్, వైస్ ఎంపీపీ ఎలీశమ్మ, రాచర్ల, కాలువపల్లె సర్పంచ్‌లు రాయలమ్మ, నారాయణమ్మ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యేలం మురళీకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ నాగిరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు పగడాల శ్రీరంగం, సూర పాండురంగారెడ్డి, ఈఓఆర్డీ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర నాయక్, ప్రతాప్‌రెడ్డి, ఏవీ సురేష్, నవీన్‌కుమార్, వీఆర్వో శివయ్య, సర్వేయర్ మాధవి పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో గ్రామ సచివాలయం-3, 4 పరిధికి సంబంధించి శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అధికారులు 2433 సర్వీసులు పరిష్కరించారు. సచివాలయం-3లో 1053 సర్వీసులు, సచివాలయం-4లో 1380 సర్వీసులకు సంబంధించి లబ్ధిదారులకు ఉచితంగా సర్టిఫికెట్లు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో డీఎల్‌డీవో బీవీఎస్ సాయికుమార్, తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి, ఎంపీడీవో వైవీ నాగేశ్వరప్రసాద్, డీటీ విజయభాస్కర్, ఈవోపీఆర్డీ ఈదుల రాజశేఖరరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సతీష్, ఉమా, ఏఎంసీ మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములునాయక్, నాయకులు ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

బేస్తవారిపేట: గ్రామాల్లోని ప్రజల సమస్యలు ఇంటి వద్దే పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష పథకాన్ని ప్రారంభించిందని ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అక్కపల్లెలో జగనన్న సురక్ష పథకంలో పాల్గొన్నారు. అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. తహసీల్దార్ తహసీల్దార్ డీవీబీ వరకుమార్, ఎంపీడీఓ ఎస్. చెన్నకేశవరెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, మండల ఉపాధ్యక్షుడు డి.ఖాజామీయా, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



బేస్తవారిపేట: సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఓసూరారెడ్డి



యర్రగొండపాలెం: సర్టిఫికెట్ అందజేస్తున్న అధికారులు



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ ఖాశింబీ



గిద్దలూరు: లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు

అర్హులకు సంక్షేమ ఫలాలు



వృద్ధురాలికి పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే అన్నా

● ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

కంభం: రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హులకు సంక్షేమ ఫలాలు అందిస్తోందని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని లింగాపురంలో ఆయన పర్యటించారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. అర్హత ఉండి ఇంకా సంక్షేమ పథకాలు పొందని వారుంటే జగనన్న సురక్ష, జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. గత ప్రభుత్వంలా మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసే పరిస్థితి ప్రస్తుతం రాష్ట్రంలో లేదని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ఇచ్చిన హామీలను ఇప్పటికే 99 శాతం వరకు అమలు పరిచారని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నరాల నాగార్జునరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, జేసీఎస్ కన్వీనర్ డిష్ మున్నా, మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, చెన్న కృష్ణారెడ్డి, కందుల రాజశేఖరరెడ్డి, నంద్యాల ఖాదర్‌బాషా, పెద్ద మౌలాలీ, రామిరెడ్డి పెద్ద వెంకటరెడ్డి, అన్నెం వెంకట సుబ్బారెడ్డి, సబ్బసాని సాంబశివారెడ్డి, అర్ధవీడు మాజీ ఎంపీపీ నన్నెబోయిన రవికుమార్, కంభం సర్పంచ్ పల్నాటి బోడయ్య, బొగోలు సర్పంచ్ పోతిరెడ్డి, సయ్యద్ సలీం, ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షుడు రావూరి జనార్దన్, బాషు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో సమస్యల పరిష్కారం



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం 33వ వార్డు పరిధిలోని జవహర్‌నగర్ కాలనీ, రజక వీధి ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విశేష కృషి చేస్తున్నారన్నారు. నవరత్నాల ద్వారా అర్హులందరికీ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాల అమలు వల్ల ప్రజల కష్టాలు తీరుతున్నాయన్నారు. రైతు భరోసా, అమ్మ ఒడి, ఆసరా, వైఎస్సార్ పింఛను, జగనన్న విద్యదీవెన లాంటి పథకాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. వార్డులోని ప్రజలు ఎమ్మెల్యే కేపీపై పూలు చల్లి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి, వార్డు ఇన్‌చార్జి ముత్తారెడ్డి వెంకటరెడ్డి, కౌన్సిలర్లు దొడ్డా భాగ్యలక్ష్మి, నాసర్‌వలి, బుశెట్టి నాగేశ్వరరావు, షెక్షావలి, కోఆప్షన్ సభ్యులు వజనాక్షి, మయూరి ఖాశీం, జేసీఎస్ కన్వీనర్ పత్తి రవిచంద్ర, నాయకులు రోజ్‌లిడియా, చెన్నారెడ్డి, ఉత్తమ్‌కుమార్, కొండా యాదవ్, పట్టణ యూత్ అధ్యక్షుడు బి.కృష్ణారెడ్డి, మున్సిపల్ అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బస్సు ఏర్పాటుపై బూచేపల్లికి కృతజ్ఞతలు



బూచేపల్లి శివప్రసాదరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న ప్రిన్సిపాల్, తల్లిదండ్రులు

ముండ్లమూరు: స్థానిక ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించడం పట్ల దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డికి తల్లిదండ్రులు శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలలో చదువుతున్న మారుమూల గ్రామాల విద్యార్థులకు బస్సు లేకపోవడంతో లేక నానా అవస్థలు పడుతున్నారు. దీంతో పాఠశాల ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సమస్యను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసారెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. స్పందించిన వారు ఆర్‌టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి అద్దంకి డిపో నుంచి పాఠశాల సమయాల ప్రకారం బస్సును ఆయా గ్రామాలకు నడిపేందుకు అంగీకరించారు. మక్కెనవారిపాలెం, జమ్మలమడక, మార్లెళ్ల, గంగనపాలెం, నాయుడుపాలెం గ్రామాల విద్యార్థులకు బస్సు సౌకర్యం కలిగింది. ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు, పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం బూచేపల్లి శివప్రసాదరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి



గుడ్లను పరిశీలిస్తున్న డ్వామా పీడీ శీనారెడ్డి

పెద్దారవీడు: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యంగా పెట్టాలని డ్వామా పీడీ, మండల ప్రత్యేకాధికారి కె.శీనారెడ్డి అన్నారు. మండలంలో గొబ్బూరు జెడ్పీహెచ్ పాఠశాల నాడు-నేడు పనులు, అంగన్‌వాడీ కేంద్రం, చట్లమిట్లలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సచివాలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం గర్భిణులు, బాలింతలకు అందజేయాలని కార్యకర్తలకు సూచించారు. సచివాలయం సిబ్బంది విధులు నిర్వహించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని హెచ్చరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సమయానికి వైద్యశాలకు రావాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ ఎం.నాసరురెడ్డి, సర్పంచ్ అంగిరేకుల ఆదినారాయణ, ఏర్వ ఆల్లూరమ్మ, ఎంఈఓలు పి.శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం జీవీ సుబ్బారావు, ఏపీఓ సాంబశివయ్య, ఈసీ మంత్రునాయక్, టీఏ సుబ్బయ్య ఉన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో భక్తులు

త్రిపురాంతకం: శ్రావణ శుక్రవారం అధిక మాసంలో బాలాత్రిపురసుందరీదేవి,పార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. త్రిపురాంతకంలోని ఆలయాల్లో స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆశీర్వచనం అందించి ప్రసాదాలు అందజేశారు.

రేపు రుద్రాభిషేకం

త్రిపురాంతకం: సత్యసాయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా మహన్యాస పూర్వక రుద్రాభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవ సంస్థల నిర్వాహకులు తెలిపారు. త్రిపురాంతకం పార్వతి సమేత త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయం వద్ద ఏకదశ రుద్రాభిషేకం, గోమాత పూజ, మహానగర సంకీర్తన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులంతా పాల్గొనాలని కోరారు.

పేదలకు వరం.. వైఎస్సార్ కంటి వెలుగు



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

మార్కాపురం: వైఎస్సార్ కంటి వెలుగు పథకం పేదలకు వరం లాంటిదని డీవైఎం హెచ్ఓ డాక్టర్ రాహుల్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 11వ వార్డులో వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కంటి చూపు సరిగా లేనివారికి పరీక్షలు నిర్వహించి, కళ్లజోళ్లు పంపిణీ చేస్తామన్నారు. పేదలు ఈ వైద్యశిబిరాన్ని వినియోగించుకుని కంటిచూపు మెరుగుపరుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి ఉత్తమ్, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బీఎల్వోలు అప్రమత్తంగా ఉండాలి

పుల్లలచెరువు: గ్రామాల్లో పనిచేస్తున్న బీఎల్వోలు అప్రమత్తంగా ఓటర్ సర్వే చేయాలని తహసీల్దార్ దాసు అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఓటర్ సర్వేను ఆయన తనిఖీ నిర్వహించి బీఎల్వోలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాలపై జరుగుతున్న ఓటర్ సర్వేను జాగ్రత్తగా నిబంధనల ప్రకారం నిర్వహించాలన్నారు.

ప్రకృతి సాగుపై అవగాహన



కషాయం తయారీ విధానాన్ని వివరిస్తున్న లలితమ్మ

పెద్దారవీడు: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ మాస్టర్ ట్రయినర్ డి.లలితమ్మ అన్నారు. మండలంలో సానికవరంలో కషాయాల తయారీపై రైతులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పశువులు తినే పది రకాల ఆకులు 20 కేజీలు, దేశి ఆవు మూత్రం 10 లీటర్లు, కొంత మోతాదులో పోగాకు సూర, పసుపు, అల్లం, పచ్చిమిర్చి, వెల్లుల్లి అన్నీ మెత్తగా రోట్లో దంచిన అనంతరం 200 లీటర్ల నీటిలో కలిపి 45 రోజుల పాటు ఉంచాలని చెప్పారు. తర్వాత కషాయాన్ని పంటలపై పిచికారీ చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని, అంతర పంటలపై దృష్టి సారించాలన్నారు. సర్పంచ్ ఎంవీ రమణారెడ్డి, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

24న పీర్లకు పగలు షరిగత్



మార్కాపురం: మకాన్‌లో కొలువుదీరిన పీర్లు

మార్కాపురం టౌన్: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పట్టణంలోని గొర్లగడ్డ, తూర్పువీధి, విజయటాకీస్, నాగులవరం రోడ్డు, కొండారెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లోని పీర్ల మకాన్లలో పీర్లు కొలువుదీరాయి. ఈ నెల 24న మధ్యాహ్నం 2.30 గంటలకు ఖాశీం పీరుకు పగలు షరిగత్ నిర్వహించనున్నట్లు ముజావర్లు శుక్రవారం తెలిపారు. 27వ తేదీన రాత్రి ఒంటి గంటకు బాదుల్లా సాహెబ్ పీరుకు చిన్న షరిగత్, 28న పెద్ద షరిగత్, 29వ తేదీన సాయంత్రం 4.30 గంటలకు షహదత్(పల్లకి ఊరేగింపు) నిర్వహించనున్నట్లు వివరించారు.

మణిపూర్ ఘటన నిందితులను శిక్షించాలి



మాట్లాడుతున్న ఎంపీజే నాయకులు

మార్కాపురం: మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై లైంగిక దాడికి పాల్పడి, నగ్నంగా ఊరేగించిన ఘటన సభ్యసమాజం తలదించుకునేలానుందని, నిందితులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్‌రజాక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇస్లాంపేటలోని ఎంపీజే కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 79 రోజులుగా మణిపూర్ రావణకాష్టంగా రగులుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రసూల్, జిల్లా అధ్యక్షుడు ఖాశీం, నాయకులు అమీర్‌బాషా, అయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పెద్దారవీడు: మండలంలోని మద్దలకట్ట గ్రామ సచివాలయం పరిధిలో చాట్లమడ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం శనివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. ముఖ్య అతిథిగా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ హాజరవుతారని, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ పలు విభాగాల నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు కూడా రావాలని కోరారు.